క్లుప్తంగా

దుద్యాలకు ట్రాక్టర్ మంజూరు



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ శోభలత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామ పంచాయతీకి మహేంద్ర కంపెనీ ట్రాక్టర్ మంజూరు అయ్యిందని గ్రామ సర్పంచ్ చందమాల శోభలత తెలిపారు. శనివారం ట్రాక్టర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో దుద్యాల గ్రామం మేజర్ పంచాయతీ కావడంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్పొరేషన్ నుంచి మహేంద్ర ట్రాక్టర్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ట్రాక్టర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులకు ఉపయోగించుకోవడానికి అవకాశం ఉందన్నారు.

యూనిఫాం క్లాత్ మంజూరు

పాములపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు యూనిఫాం క్లాత్ వచ్చినట్లు ఎంఈఓ 2 సుభ్బూషిణీదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 1నుంచి 10 వ తరగతి విద్యార్థులందరికీ క్లాత్ వచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు 2,223, బాలురు 1,877 మందికి సంబంధించి రెండు జతల చొప్పున బట్టలు వచ్చినట్లు వెల్లడించారు. త్వరలో ఆయా పాఠశాలలకు పంపించి, విద్యార్థులకు అందజేస్తామని వివరించారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్యం

పాములపాడు: ఫిజియోథెరపీతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంఈఓ- 2 సుభాషిణి దేవి అన్నారు. శనివారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిజాం ఫిజియోథెరపీ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టులు మహేష్, రమేష్‌లు ఫిజియోథెరపీ ఆవశ్యకతను వివరించారు తలనొప్పి, మెడనొప్పి, నడుము నొప్పి తదితర వాటికి ఫిజియోథెరపీ ఎలా పని చేస్తుందో తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, ఐఈ ఆర్టీలు షంషుద్దీన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

లారీ బోల్తా

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి మలుపులో శనివారం లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్ర నుంచి అల్లం లోడ్‌తో ఆత్మకూరు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లారీలో డ్రైవర్, క్లీనర్ ఉండగా.. ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పార్నపల్లెలో పనులు చేయిస్తున్న సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్

మహానంది: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ సూచించారు. గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు రోడ్డుకు అటు, ఇటు ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. కార్యదర్శి రాముడు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ చేపట్టాలి

నందికొట్కూరు: నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం, వారిలో 8 మంది విద్యార్థులు ఒకే కేంద్రంలో పరీక్ష రాయడం చూస్తే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు మద్రిస్వామి, స్థానిక నాయకులు జిప్సం, అరుణ్, ముజుమిల్, అపరంజి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మణికంఠన్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా పనిచేసిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ మణికంఠన్, కుటుంబ సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

అయోమయంలో వలంటీర్లు

- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టిన టీడీపీ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులు, ఇతరశాఖల ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- జూన్ నెల వలంటీర్ల వేతనాల బిల్లు పెట్టినట్లు అధికారుల వెల్లడి
- అయినా పింఛన్లు పంపిణీ చేయించక పోవడంతో ఆందోళనలో వలంటీర్లు



ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు (ఫైల్)

జూపాడుబంగ్లా: మొదటి నుంచి వలంటీరు వ్యవస్థను వ్యతిరేకిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు మాటమార్చి తాను అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగించటంతో పాటు ఒక్కోవలంటీరుకు నెలకు రూ.10 వేల చొప్పున గౌరవవేతనం మంజూరు చేస్తానని వాగ్దానం చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక మొదటి నెలలోనే పింఛన్ల పంపిణీకి వారిని దూరం చేసి ఉద్యోగులతో పింఛన్లు పంపిణీకి శ్రీకారం చుట్టడంతో వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 470 మంది వలంటీర్లు

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పాములపాడు, కొత్తపల్లి, మిడుతూరు, పగిడ్యాల మండలాల్లో 1,122 మంది వలంటీర్లు ఉండగా వారిలో ఎన్నికలకు ముందు 652 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓలకు సమర్పించగా 470 మంది వలంటీర్లు విధుల్లో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విధుల్లో ఉన్న వలంటీర్లకు ప్రతి నెల గౌరవవేతనంగా రూ.5వేలు ఇస్తుండగా జూన్ మాసానికి గాను గౌరవవేతనం మంజూరుకు ప్రభుత్వానికి బిల్లులు పంపినట్లు ఎంపీడీఓ కార్యాలయాల అధికారులు పేర్కొంటున్నారు. విధుల్లో ఉన్న వలంటీర్లకు వేతనం చెల్లిస్తున్నప్పుడు వారితో పింఛన్లు పంపిణీ చేయించకపోవడం వెనుక అంతర్యమేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు కలిపి 30,607 పింఛన్లు మంజూరు అయ్యాయి. వాటిని పంపిణీ చేయటానికి 50 పింఛన్లకు కలిపి ఓ ఉద్యోగి చొప్పున నియమించి వారితో ఒకటోవ తేదీన పింఛన్లు పంపిణీ చేయించనున్నారు.

711 మంది ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ విధులు

జూలై నెల పింఛన్ల పంపిణీ చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, వెటర్నరీ, స్కూల్స్, వ్యవసాయశాఖ, ఇలా అన్నిశాఖల్లోని సీఎఫ్ఎంఎస్ ఐడీ కలిగిన ఉద్యోగులను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు నియమించారు. 50 పింఛన్ల పంపిణీకి ఓ ఉద్యోగి చొప్పున నందికొట్కూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 711 మంది ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి నియమించారు. జూపాడుబంగ్లా మండలంలో-100, కొత్తపల్లిలో-85, మిడ్తూరు-108, నందికొట్కూరు మండలంలో-203, పాములపాడు-117, పగిడ్యాల-98 చొప్పున ఉద్యోగులను కేటాయించారు. వలంటీర్లుండగా మాతో పింఛన్లు పంపిణీ చేయించటమేంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. పైగా పింఛన్ల పంపిణీకి సరిపడా సచివాలయ ఉద్యోగులున్నా ఇతర శాఖల్లోని ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి నియమిస్తున్నారు. ఉద్యోగులు జూలై ఒకటోవ తేదీన ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల్లోగా పంపిణీ పూర్తిచేయాలనే నిబంధనను విధించారు.

నియోజకవర్గం వ్యాప్తంగా 30,607 పింఛన్లు మంజూరు

జూలై మాసానికిగాను నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా 30,607 పింఛన్లు మంజూరు అయ్యాయి. జూపాడుబంగ్లా మండలానికి 5,075, నందికొట్కూరు రూరల్-5,241, నందికొట్కూరు టౌన్-4,981, పగిడ్యాల-4,947, మిడ్తూరు-5,442, పాములపాడు-5,889, కొత్తపల్లి-4,273 చొప్పున పింఛన్లు మంజూరు అయ్యాయి. ఆత్మకూరు నియోజకవర్గంలోని మహానంది-5,280, ఆత్మకూరు రూరల్-4,927, ఆత్మకూరు టౌన్-4,325, బండిఆత్మకూరు-6,656, వెలుగోడు-6,590, శ్రీశైలం-2,356 చొప్పున 30,134 పింఛన్లు విడుదలయ్యాయి.

పింఛన్ల పంపిణీకి వివిధ శాఖల ఉద్యోగులను నియమించాం



మండలంలో వలంటీర్లు 76మంది విధుల్లో ఉన్నా వారితో కాకుండా ఉద్యోగులతో జూలై నెల పింఛన్లు పంపిణీ చేయించాలన్న ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పింఛన్ల పంపిణీకి ఉద్యోగులను నియమిస్తున్నాం. 50 మంది పింఛన్ దారులకు ఓ ఉద్యోగి చొప్పున పింఛన్ల పంపిణీకి వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను నియమిస్తున్నాం. పింఛన్లు జూలై నెల ఒకటోవ తేదీ ఉదయం ఆరుగంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటల్లోగా పంపిణీ పూర్తిచేయాల్సి ఉంది.

– నూర్జహాన్, ఎంపీడీఓ, జూపాడుబంగ్లా

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం



కేసులను పరిశీలిస్తున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు సత్వరన్యాయం అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రధానంగా ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌లో రాజీ కావొచ్చని చెప్పారు. లోక్‌అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్ కేసులు 24, సివిల్ కేసులు 12, మెయింటెనెన్స్ కేసులు 01, బ్యాంకు లావాదేవీల కేసులు 04, చెక్‌బౌన్స్ కేసులు 01, డీవీసీ కేసు-01తో మొత్తం 43 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

మిడుతూరు: రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ పీరునాయక్ అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు పంటల సాగు, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన కలిగిఉండాలన్నారు.

ఇష్టానుసారం అజెండాను ప్రవేశపెడితే ఆమోదించం

- నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- మున్సిపల్ సాధారణ సమావేశంలో అజెండాపై వాగ్వాదం
- కౌన్సిలర్లకు తెలియకుండా ప్రతిపాదనలు పెట్టడంపై ఛైర్మన్ ఆగ్రహం
- సమావేశాన్ని బైకాట్ చేసిన ఛైర్మన్, కౌన్సిల్ సభ్యులు





సమావేశంలో ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి.. ఎమ్మెల్యే జయసూర్య వాగ్వాదం, హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

నందికొట్కూరు: అజెండా ఇష్టానుసారంగా ప్రవేశపెడితే ఆమోదించడం జరగదని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో ముందుగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే జయసూర్యకు, ఎంపీ బైరెడ్డి శబరికి ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమావేశం ప్రారంభం కాగా మున్సిపల్ ఛైర్మన్, ఎమ్మెల్యే జయసూర్య మధ్య ప్రతిపాదనల ఆమోదం విషయంలో వాగ్వాదం జరిగింది. 12వ వార్డులో కౌన్సిలరు లాల్‌మోహన్ రవిశంకర్ ప్రసాద్‌కు తెలియకుండా సాధారణ సమావేశంలో జీఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టడంపై మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డిపై ఛైర్మన్ మండిపడ్డారు. ఆ ప్రతిపాదనతో పాటు 25వ వార్డుకు సబంధించిన మరికొన్ని టేబుల్ ప్రతిపాదనలు పెట్టడంతో వీటిని ఆమోదించేది లేదని ఛైర్మన్ తేల్చి చెప్పారు. జోక్యం చేసుకున్న ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ అజెండాలోని అంశాలను ఆమోదించాలని ఆదేశించడంతో ఛైర్మన్, కౌన్సిల్ సభ్యులు సాధారణ సమావేశాన్ని బైకాట్ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తమకు, కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా అజెండాలో ప్రతిపాదనలు పెడితే అవమానించినట్లేనన్నారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ప్రతిపాదనలు పెడితే ప్రజల చేత ఎన్నుకోబడిన ఛైర్మన్, కౌన్సిల్ సభ్యులు ఎందుకన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఇష్టానుసారంగా ఆదేశాలిస్తే మేమేందుకని బయటకు వస్తే,, దళితుడినైనందుకే అవమానించారని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంతేకాకుండా మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగి విజయలక్ష్మిని దళిత మహిళా అని చూడకుండా దళిత ఎమ్మెల్యే సమక్షంలో 2వ వార్డు కౌన్సిలరు జాకీర్ హుసేన్ వేధించడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో టీపీఓ బాలమద్దయ్య, విద్యుత్ ఏఈ రాములునాయక్, వైస్ ఛైర్మన్లు ప్రశాంతి, రబ్బాని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మిట్టకందాలలో ప్రబలిన అతిసారం

- గ్రామంలో 6 కేసులు నమోదు
- వైద్య శిబిరం ఏర్పాటు
- గ్రామాన్ని సందర్శించిన డీఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ



బాధితురాలితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో 6 అతిసారా కేసులు నమోదయ్యాయి. విషయం తెలుసుకున్న డాక్టర్ నాగలక్ష్మి దేవి శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రమాదేవి, గాయత్రీలు శుక్రవారం అతిసారం వ్యాధి బారిన పడ్డారు. వారు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. కాగా మరో నలుగురు ఎస్సీ కాలనీలో సుజాత, రాంచరణ్, అభిరాం, సౌమ్యలు వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్నారు. ఎస్సీ కాలనీ సమీపంలో క్రిష్టారావు పేట గ్రామ రహదారిలో పైపు లైన్ లీకేజీ అయినట్లు గుర్తించారు. బాధితులందరూ ఒకే కాలనీకి చెందిన వారు అయినందున, పైపు లైన్ లీకేజీ కారణమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో అతిసార కేసులు నమోదయ్యాయనే విషయం తెలుసుకున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు గ్రామాన్ని సందర్శించారు. వీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు. గ్రామంలోని నీటి వనరులను పరిశీలించారు. అతిసార వ్యాధి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో వైద్యశిబిరం కొనసాగించాలని, ఎక్కడేగాని పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి ఉన్నారు. గ్రామంలో సర్పంచు చింతల నారాయణతో కలిసి ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రియ గ్రామంలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. అన్నింటినీ శుభ్రం చేయించారు. అతిసార వ్యాధి ప్రబలడానికి కారణంగా భావిస్తున్న పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు.

దళితుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: దళితుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏబీఎం, ఎస్పీజీ పాలెంలో శనివారం ఆయన దళితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి దళిత కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కాలనీలో ఏదైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



ఉపాధ్యాయురాలికి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్టీఓ ఎస్.ఎన్.రెడ్డి

ఆత్మకూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివాలని, ఉన్నత స్థాయికి చేరుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆర్టీఓ ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డిపాల్ పాఠశాలలో విద్యా సంవత్సరపు ప్రారంభ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీఓ మాట్లాడుతూ విద్యార్థులు తప్పుడు మార్గాల్లో వెళ్లరాదని, చెడు వ్యసనాలైన మద్యం, సిగరెట్, గుట్కా వంటి వాటి జోలికి వెళ్లరాదన్నారు. అనంతరం విద్యార్థులకు రహదారి ప్రమాదాలు, నియమ, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ షిన్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలి

జూపాడుబంగ్లా: జూలై నెల ఒకటోవ తేదీన పకడ్బందీగా పింఛన్లు పంపిణీ చేయాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్ ఆదేశించారు. శనివారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి ఒక్కో ఉద్యోగికి 50ఇళ్ల చొప్పున కేటాయిస్తూ 108 మందిని నియమించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటల్లోగా పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాయంత్రం ఆరు గంటల్లోగా పూర్తి చేయాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

పగిడ్యాల: జూలై నెల పింఛన్‌ల పంపిణీని పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ కవిరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలో 4,947 మంది పింఛన్‌దారులు ఉన్నారని వెల్లడించారు. సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు వస్తున్నారని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

గురుకులంలో ఖాళీసీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో 6 నుంచి 9 వరకు ఖాళీగాఉన్న 12 సీట్ల భర్తీ కోసం శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 378 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. పాఠశాలలోని ఆరోవ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు 8 సీట్లు, ఏడో తరగతిలో ఎస్సీ-1 సీటు, ఎనిమిదోవ తరగతిలో ఎస్సీ-3సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయి. తొమ్మిదోవ తరగతిలో సీట్లు ఖాళీగా లేకపోయినా ప్రవేశపరీక్ష నిర్వహించారు. సీట్ల కోసం 405 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 378 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండు, మూడు రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదిలా ఉండగా గురుకుల పాఠశాలలో సీట్ల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు చేస్తున్న రెకమెండేషన్లతో పాఠశాల ప్రిన్సిపాల్ ఎవరికి ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక తలపట్టుకుంటున్నారు. కాగా, కొంత మంది పిల్లవాడు ఆన్‌లైన్ దరఖాస్తు చేయకపోయినా, ప్రవేశపరీక్ష రాయకపోయినా తప్పనిసరిగా సీటు కేటాయించాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. సీట్ల కేటాయింపు తన చేతిలో లేకపోవడంతో ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ప్రవేశ పరీక్షకు విశేష స్పందన

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు విశేష స్పందన లభించింది. 6, 7,8 ,9 తరగతిలో మిగిలిన 8 సీట్లకు నోటిఫికేషన్ ఇవ్వగా 143 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రవేశ పరీక్షను పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ పకడ్బందీగా నిర్వహించారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపులు ఉంటాయని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని రైతులకు ఉద్యాన శాఖ తరపున సబ్సిడీపై ఉల్లి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మల్యాల వీఏఏ శాంతిరాజు తెలిపారు. విత్తనాలు తీసుకోవాలనుకునే రైతులు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎల్ 883 రకం ఉల్లి విత్తనాలు సబ్సిడీ కింద కేజీ రూ.1800, అగ్రి పౌండ్ డార్క్ రెడ్ గ్రామ్ రకం రూ.1400కు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిది



నందికొట్కూరులో ఏఈ దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ సిబ్బంది




ఆత్మకూరులో షఫీవుల్లాను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

నందికొట్కూరు : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిదని హంద్రీనీవా సుజల స్రవంతి డీఈ శకుంతల అన్నారు. శనివారం పట్టణంలోని హెచ్ఎన్ఎస్ఎస్‌లో ఏఈగా పనిచేస్తు పదవీ విరమణ పొందిన ఏఈ సాంబశివుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఈ శశికుమారి, డీఈఈ సీతసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లి: మండలంలోని పాలెం చెరువు చెంచుగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గ్రేడు- 2 హెడ్మాస్టర్ గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన కనక చంద్రశేఖర్ పదవీ విరమణ కార్యక్రమంలో నంద్యాల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శివప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సన్మానించారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, రాణెమ్మ, దరగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: తెలుగు గంగలో ఫిట్టర్ గ్రేడ్-1గా విధులు నిర్వహిస్తున్న అన్యం సత్యనారాయణరెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. స్థానిక తెలుగు గంగ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది.

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్ఎల్వీ ఫంక్షన్ హాలులో శనివారం ఆర్టీసీ ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా సన్మాన కార్యక్రమం జరిగింది. ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి మద్దిలేటి తదితరులు ఆయనను సన్మానించారు.



వెలుగోడులో తెలుగుగంగలో ఫిట్టర్ అన్యం సత్యనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



కొత్తపల్లి ఆశ్రమపాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్


బైర్లూటి, పెచ్చెరువులో వైద్య శిబిరాలు

ఆత్మకూరు: మండంలోని పెచ్చెరువు, బైర్లూటి చెంచుగూడేల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచి, నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త నిర్వహణలో శనివారం ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. శిబిరాల్లో వైద్యాధికారి గోపాల్, పవన్‌కుమార్, సాయికుమార్ హాజరై ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, షుగర్, బీపీ, గుండె తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేషులు, ఆత్మకూరు రెడ్‌క్రాస్ కన్వీనర్ చింతలయ్య, నంద్యాల మండల ఉపాధ్యక్షుడు, మెడికల్ క్యాంపు కన్వీనర్ సోహెల్, డీఎఫ్ఓ రాజునాయక్, బైర్లూటీ గూడెం సర్పంచ్ గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులను ఢీకొన్న కారు

మహానంది: అయ్యలూరి మెట్ట నుంచి ప్రకాశం జిల్లా కృష్ణంశెట్టిపల్లెకు వెళ్తున్న ఓ కారు రెండు బైకులను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కృష్ణంశెట్టిపల్లెకు చెందిన హనుమంతరెడ్డి కారులో వెళ్తూ గోపవరం సమీపంలోని పైపుల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న ఓ బైక్, వెనుకే వస్తున్న మరో బైకును ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాజులపల్లెకు చెందిన వలి, గాజులపల్లెకు చెందిన నరేష్‌లు గాయపడ్డారని స్థానికులు తెలిపారు. కాగా, కారు ఆపకుండా వెళ్లడంతో స్థానికులు మహానంది పోలీసులకు సమాచారం ఇవ్వగా హైవే రోడ్‌సేఫ్టీ వాహన డ్రైవర్ రసూల్ వెంటనే దిగువమెట్ట పోలీసులను అప్రమత్తం చేయడంతో కారును పట్టుకొని మహానంది స్టేషన్‌కు తరలించారు.

నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు



పద్మావతిని సన్మానిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ తులశమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధు లు నిర్వహిస్తున్న సబార్డినేట్ (అటెండర్) పద్మావతి పదవీ విరమణ సందర్భంగా తహసీల్దార్ ఆధ్వర్యంలో సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, ఆర్ఐ మహమ్మద్ హుసేన్ పాల్గొన్నారు.